# మూడు స్తంభాలాట




'అవును.. సరే.. మీ ఇష్టం!' అని అర్థం వచ్చేలా రామస్వామి తల ఊపడంతో..

''సరే బాబు!'' అంటూ లోపలికి రమ్మన్నాడు తండ్రి.

రామస్వామితోపాటు భోజనం చేసిన ఆయన.. గదిలోకి వచ్చాక 'ప్రకాశ్' అని రాసి ఉన్న చీటీ చూపించి, దాన్ని చిన్నచిన్న ముక్కలుగా చించేశాడు.

'సరే!' అన్నట్టు రామస్వామి తలాడించాడు.

రాత్రి ఆలస్యంగా నిద్ర పోయిన ఆగంతకుడు మర్నాడు పొద్దున్నే నాలుగింటికి లేచి సిద్ధమై కూర్చున్నాడు. బయటి నుంచి మోటర్‌సైకిల్ వస్తున్న శబ్దం వినరాగానే.. ఆయన చిరునవ్వుతో తల ఊపి వెళ్లిపోయాడు. రామస్వామికి భయంతో రాత్రంతా అస్సలు నిద్ర పట్టలేదు. ఓ గంట తర్వాత గుప్పుమన్న వార్తతో ఊరు నిద్ర మత్తు వదిలింది.

ఫస్ట్ బస్సుకు హైదరాబాద్ వెళ్తున్న రాంపల్లి భూస్వామిని బస్సు ఎక్కుతుండగా డోర్ దగ్గరే కాల్చి చంపారని తెలిసి.. ఊరంతా పోలీసుల బూట్ల చప్పుడుతో మార్మోగింది. తూటా పేల్చినవాడు రాత్రి తమ ఇంట్లో ఉన్న సంగతి గుర్తొచ్చి, రామస్వామి గుండె గుబులు గుబులుగా కుదుపులకు గురయింది. రామస్వామి అదంతా తన కడుపులోనే దాచుకున్నాడు. పార్టీ విషయాలు రెండో మనిషికి కూడా తెలియకూడదని ముందే ప్రకాశ్ చెప్పినందున.. ఎక్కడా నోరు విప్పలేదు. ఫలానా దళ సభ్యుడు ఈ దురాగతానికి పాల్పడ్డాడని మాత్రం పోలీసులు ప్రకటించారు. వారి అన్వేషణలో ఏ చిన్న ఆధారం చిక్కినా తన కుటుంబ పరిస్థితి గుర్తుకొచ్చి వణుకు పుట్టేది. చెప్పాచెయ్యకుండా మరో పిడుగు పడుతుందేమోనన్న భయంతో.. ఆ విషయాన్ని ప్రభాకర్‌తో చెప్పాడు రామస్వామి. ఆ రోజు రాత్రి తెలుగు లెక్చరర్ ఇంట్లో జరిగిన రాజకీయ తరగతులకు రామస్వామి వెళ్లలేదు.

''రామస్వామి రాలేదేం?'' అన్న ప్రకాశ్‌తో.. రామస్వామి భయపడుతున్న విషయాన్ని చెప్పాడు ప్రభాకర్.

''అయ్యో! ముందే చెప్పొచ్చు కదా! సరే.. ఇక ముందు ఎవ్వరూ రారు. తనను మాత్రం క్లాసులకు రమ్మను'' అన్నాడు ప్రకాశ్.

* * *

రాత్రి పది దాటాక ప్రభాకర్ భోజనానికి కూర్చున్నాడు. తల్లి రెండు పళ్లేలను తీస్తున్నది. దర్వాజకు ఎదురుగా కూర్చున్న ప్రభాకర్‌కు ఇంటి ముందర ఒకాయన కనిపించాడు.

'అర్థం చేసుకో!' అన్నట్లు తల ఊపాడు.

ఆయన పేరేమో కానీ, పరిచయం ఉన్న మనిషిని పిలిచినట్లు..

''రా.. మహేశ్! లోపలికి రా!'' అంటూ లేచి.. ఆయన్ను లోపలికి తీసుకొచ్చి కూర్చోమన్నాడు ప్రభాకర్.

ప్రభాకర్ దోస్తులందరూ ఆయన తల్లికి తెలుసు.

''మా కాలేజినే! వానకు రూమ్ తడిస్తే మనింటికి రమ్మన్న!'' అన్నాడు తల్లితో.

''దాందేముంది బిడ్డా! కూర్చోమను. అన్నం తింటడు'' అని ఇంకో పళ్లెం తీసింది.

అలా ఎవరెవరో రాత్రి – పగలు ప్రభాకర్ ఇంటికి వస్తున్నారు. ఇల్లు చిన్నదే అయినా.. సందులో ఉన్నందున ఎవరి చూపూ పడదు. చూసినవాళ్లు కూడా చుట్టాల పిల్లలేమో అనుకుంటారు.

ఓ రోజు తెల్లవారి చూస్తే.. ఇంట్లో తల్లికి ప్రభాకర్ కూడా కనిపించలేదు. రెండ్రోజులుగా ఇంట్లో ఉంటున్నాయన ఎవరి దగ్గరికైనా తీసుకెళ్లాడేమోనని దినమంతా ఎదురుచూసింది. పొద్దుగుంకుతున్నా ప్రభాకర్ జాడ లేదు. ఏమై ఉంటుందోనని రామస్వామి ఇంటికెళ్లింది.

''ఎటు వెళ్లడు.. వస్తడులే చిన్నమ్మా! నేను చూసొస్తా. నువ్వు ఇంటికి పో!'' అని తను బయటపడ్డాడు.

తెలుగు లెక్చరర్ ఇంట్లో ప్రకాశ్ కలిశాడు. ప్రభాకర్ తల్లి చెప్పిన మాటలు ఆయనతో అన్నాడు.

''వస్తడు!'' అని చెప్పిన ప్రకాశ్.. పొడి మాటను పొడిగించవద్దని ఊరుకున్నాడు.

ప్రకాశ్ చెప్పనిదేమిటంటే.. ప్రభాకర్ పార్టీలో పని చేస్తానని ఆయనతో చాలా రోజులుగా అంటున్నాడు. అండర్ గ్రౌండ్ కాకుండా లీగల్‌గా ఆయన నుంచి పని తీసుకోనేందుకు పార్టీ ఒప్పుకొన్నది. రహస్యంగా కరీంనగర్‌లో తయారవుతున్న మాస పత్రిక కాపీలను రద్దీ కాగితాల్లో చుట్టి.. జిల్లా అంతటా పంచి, రెండ్రోజుల్లో ఇంటికి వచ్చాడు ప్రభాకర్.

''చిన్న పని దొరికింది. డబ్బులిస్తారు'' అని తల్లితో అబద్ధమాడాడు.

''అట్లా చెప్పా చెయ్యకుండా మళ్లెప్పుడు పోకు బిడ్డా!'' అని సర్దుకుంది ఆమె.

అప్పటినుంచి ప్రభాకర్ పగలు – రాత్రి ఎటు వెళ్లినా.. ఏదో నాలుగు పైసలొచ్చే పనికి వెళ్తున్నాడని అనుకునేది. ఇంటికి వచ్చే వాళ్లను పనిలో దొరికిన దోస్తులనుకునేది. కొన్ని రోజుల తర్వాత ఓ రాత్రి పూట ఇద్దరు పోలీసులు ప్రభాకర్ ఇంటికి వచ్చారు. తల్లి ఒక్కతే ఇంట్లో ఉంది. వస్తువులను చిందర వందర చేస్తూ ఇల్లంతా వెతికారు. ఆనాటి నుంచి ప్రభాకర్ మళ్లీ ఇంటివైపు రాలేదు. అప్పుడప్పుడూ వచ్చి బెదిరిస్తున్న పోలీసుల కాళ్ల మీదపడి..

''సార్లూ.. నా బక్క పానంతోని ఆడుకోకుండ్రి!'' అని వేడుకునేది ప్రభాకర్ తల్లి.

* * *